


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




శనివారం 27 జూన్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3

# క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం







భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దేశంలో ఐఐటీ–జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు సూర్యాపేటలో ఉన్న హోటల్ శ్రీ గ్రాండ్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించింది. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూర్యాపేటలో ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే క్రమబద్ధమైన విద్యా శిక్షణ ద్వారా భవిష్యత్తు పోటీ పరీక్షలకు బలమైన పునాదిని ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలలో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని చెప్పారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు'. ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ 'అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు.



ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ–జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు.




## సంఘాల పేరుతో విద్యాసంస్థలను ఇబ్బంది పెట్టవద్దు

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి.



ప్రవేట్ విద్యాసంస్థల ను సంఘాల పేరుతో ఇబ్బందులు, బెదిరింపులకు గురి చేస్తున్నారు అని వివిధ సమస్యలపై ప్రవేట్ విద్యాసంస్థల నుండి పిర్యాదు వస్తున్నాయి, గురువారం రోజున సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల త్రివేణి పాఠశాల లోకి కొంత మంది వ్యక్తులు విద్యార్థి సంఘాల పేరుతో అక్రమంగా చొరబడి కార్యాలయం తాళాలు పగలగొట్టి, పెద్దగా నినాదాలు చేస్తూ విద్యార్థులను భయాందోళనకు గురిచేసిన విషయమై యాజమాన్యం పిర్యాదు మేరకు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు చట్టపరకారం క్రిమినల్ కేసు నమోదు చేశాం అని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఒక ప్రకటనలో తెలిపినారు. విద్యార్థి సంఘాల పేరుతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించవద్దు, విద్యాసంస్థల యాజమాన్యాలను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయవద్దు అని ఈ సందర్భంగా వివిధ రకాల సంఘాలకు డీఎస్పీ సూచించారు. పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం, విద్యార్థులను రవాణా చేసే బస్సులను అడ్డుకోవడం, యాజమాన్యాలను లేదా ఉపాధ్యాయులను బెదిరించడం, పెద్ద శబ్దాలతో నినాదాలు చేస్తూ విద్యార్థులు భయపడేలా వాతావరణం సృష్టించడం, చందాల రూపంలో డబ్బు వసూళ్లు చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్ట విరుద్ధం అని హెచ్చరించారు. ప్రవేటు విద్యాసంస్థల్లో ఏవైనా సమస్యలు ఉంటే, వాటిపై సంబంధిత జిల్లా అధికారులకు, విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేయాలి, సమస్యలపై అధికారులు నిబంధనల ప్రకారం విచారణ, దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. అంతే కానీ, విద్యార్థి సంఘాల పేరు చెప్పుకుని పాఠశాలల్లో ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవద్దని, విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ వారికి అసౌకర్యం కలిగించకూడదని సూచించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే విద్యాశాఖ అధికారులకు లేదా ఉన్నతాధికారులకు మాత్రమే నివేదించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విద్యాసంస్థల నిర్వహణకు ఆటంకం కలిగిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ స్పష్టం చేశారు. కేసులు నమోదు చేయడం, బైండోవర్ చేయడం లాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు.

# యువ నాయకులే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్





-గ్రామస్థాయి నుంచే నాయకత్వాన్ని తీర్చిదిద్దాలి

-బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలి.. ఒక్క ఓటు కూడా కోల్పోకూడదు

-మహిళలకు యువజన కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పిస్తాం

భానుపురి /సూర్యాపేట టౌన్

యువ నాయకులను తీర్చిదిద్దడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయి నుంచి యువ నాయకులను గుర్తించి వారికి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చైతన్యంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ కమిటీలను గ్రామ, వార్డు స్థాయి వరకు విస్తరించాలని, చురుకుగా పనిచేసే యువతకు సంస్థాగత బాధ్యతలు అప్పగించాలని సూచించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, ప్రతి బూత్‌లో బీఎల్ఏలు చురుకుగా పనిచేసి ఒక్క అర్హత గల ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటరు జాబితాపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలకు యువజన కాంగ్రెస్‌లో మరింత ప్రాధాన్యం కల్పించాలని, ప్రతి కమిటీలో వారికి సముచిత స్థానం ఇవ్వాలని అన్నారు. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ బలోపేతానికి యువత అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు వచ్చేలా తాను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన స్టేట్ జనరల్ సెక్రెటరీ వేలిమినేటి సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ ఆలీ, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేది లక్షాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్స్ కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, సునీల్ రెడ్డి, తన్వీర్ హుస్సేన్, సైదులు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కక్కిరేణి శ్రీనివాస్, బాలు గౌడ్, అబ్దుల్ రహీం, తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, చింతమళ్ళ రమేష్, వీరన్న నాయక్, గడ్డం వెంకన్న, రుద్రంగి రవి, బండారు వెంకన్న, ఏడ్ల వీరమల్లు,గుణగంటి సతీష్, కోడి శివ, నిమ్మల లవన్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, పడిదల రవి, యువజన పట్టణ అధ్యక్షుడు బొడ్డు సాయి, జోహార్, శ్రావ్య రెడ్డి, విజయభాస్కర్, మాధవరెడ్డి, నవీన్ చారి, హజీమ్ నరేష్, జావిద్, వినయ్, సుదీర్, లక్ష్మణ్, శివ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ డీ.వీ.కే.ఆశయాలను కొనసాగిస్తాం

భానుపురి /సూర్యాపేట టౌన్



ప్రజాపందా సిద్ధాంతకర్త, విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ దుర్గంపూడి వెంకటకృష్ణ (డీవీకే) ఆశయాలను కొనసాగిస్తామని సి.పి.ఐ(ఎం–ఎల్) మాస్ లైన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. శుక్రవారం కామ్రేడ్ డివికే నాలుగో వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ విక్రమ్ భవన్లో ఆయన చిత్రపటానికి పూలదండ వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ నక్సల్బరి,శ్రీకాకుళ పోరాటాలతో ప్రేరణ పొందిన కామ్రేడ్ డివికే, భారత విప్లవోద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. రివిజనిజంతో తెగదింపులు చేసుకున్న తర్వాత విప్లవోద్యమాన్ని నిర్మిస్తూనే, విప్లవోద్యమంలో పొడచూపిన అతి,మిత,అవకాశవాద రాజకీయాలను ఎదిరిస్తూ, సరి అయిన ప్రజాపందా కోసం అలుపెరగని పోరాటం చేసిన విప్లవ సిద్ధాంతకర్త కామ్రేడ్ డివికే అన్నారు.

## సర్ పేరుతో అర్హుల ఓట్లను తొలగిస్తే ఊరుకోం

భానుపురి /సూర్యాపేట టౌన్



కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా సర్ కార్యక్రమం పేరుతో అర్హుల ఓట్లను తొలగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని సిపిఎం వాణిజ్య భవన్ శాఖ కార్యదర్శి బొమ్మిడి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో సర్ పేరుతో అర్హుల ఓట్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికల జాబితాల్లో పేర్ల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలు పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం అమలు చేస్తున్న సర్ విధానం అనేక సందేహాలకు తావిస్తోందని అన్నారు.దేశంలోని పలు రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఈ ప్రక్రియలో అక్రమాలు జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కోరారు..ప్రతి ఓటరికి తగిన సమాచారం అందించి, అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇవ్వాలన్నారు. ప్రజల ఓటు హక్కును హరించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్ట రాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని గుర్తు చేశారు. అందువల్ల ఎన్నికల సంఘం రాజకీయ పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ప్రజల్లో అనుమానాలకు తావులేకుండా సర్ ప్రక్రియను నిర్వహించాలని కోరారు.ఎన్నికల జాబితాల సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరిగితే సిపిఎం తీవ్రంగా ప్రతిఘటిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిబంధనలను ఉపసంహరించుకోవాలని, లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు హాఫీస్ బాయ్, త్రివేణి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు రహిత సమాజమే లక్ష్యం





భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లాను మత్తు రహితంగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. ఈరోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాన్ని పట్టణ సీఐ వెంకట్‌తో కలిసి ఆయన సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న నలుగురు బాధితులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేశారు. మత్తు అలవాట్ల నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా క్యారమ్స్, చెస్ వంటి ఇండోర్ గేమ్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై యుద్ధం ప్రకటించామని, పాత నేరస్థులపై నిరంతర నిఘా ఉంచామన్నారు. మద్యం తాగిన వారిని గుర్తించినట్లే, గంజాయి సేవించిన వారిని పట్టుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కిట్లను అందించిందని డీఎస్పీ అన్నారు. వ్యసనాల బారిన పడిన యువతను మార్చడానికి డీ-అడిక్షన్ కేంద్రం ఎంతో దోహదపడుతుందని, బాధితులు స్వచ్ఛందంగా చేరవచ్చని సూచించారు. మత్తు పదార్థాల సమాచారం కోసం ప్రజలు డయల్ 100, 112 లేదా 1908 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం




నందు రాష్ట్ర ఈగల్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది, డాక్టర్స్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ఉన్నారు.

## సూర్యాపేట ఆర్య వైశ్య మహాసభ మహిళా కమిటీ ప్రమాణ స్వీకారం



భానుపురి/సూర్యాపేట టౌన్

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళ అధ్యక్షురాలు గరినే ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణ మహిళ అధ్యక్షురాలు గా మిట్టపల్లి శ్రీదేవి సెక్రెటరీ లకుమారపు పద్మజ, ట్రెజరర్ ఓరుగంటి లావణ్య, గౌరవ అధ్యక్షురాలు గా బ్రాహ్మణుల పల్లి తరంగిని, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బేలిదే రాధ మొదలగు వారు ప్రమాణ స్వీకారం చేశారు.

## ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవ ఏర్పాట్లు ప్రారంభం

భానుపురి /హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవానికి శుక్రవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. సంప్రదాయబద్ధంగా కర్ర పూజ నిర్వహించి మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ ఏడాది భక్తులకు పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో దర్శనమివ్వనున్నట్లు ఉత్సవ కమిటీ ఇప్పటికే ప్రకటించింది.ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులను ఆకర్షించే ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవానికి ఈసారి కూడా భారీ ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## చిన్నారిని ఆశీర్వదించిన డాక్టర్ పూరి సురేష్ శెట్టి



భానుపురి /వనపర్తి

శ్రీ వాసవి సేవా సమితి జోగులాంబ జిల్లా కోశాధికారి చల్లా ప్రకాష్ కుమార్తె నిత్యశ్రీ శారీ ఫంక్షన్ ను ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పూరి సురేష్ శెట్టి హాజరై చిన్నారిని ఆశీర్వదించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వాసవి సేవాసమితి నాయకులు బానురు నాగేంద్రం, ప్రవీణ్ కళ్యాణ్ ,మారం గోవిందు గుప్తా, దేవరశెట్టి ప్రకాష్, ఎలిసెట్టి వెంకటేష్, పోలిశెట్టి మురళి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

-మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి పిలుపు

భానుపురి/ తిప్పర్తి:



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొనే నల్లగొండ బహిరంగ సభకు మండలం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మర్రిగూడెంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ అభివృద్ధికి భారీ నిధులు తీసుకువచ్చి పట్టణాన్ని సుందరనగరంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ సభలో ముఖ్యమంత్రి నల్లగొండ సమగ్ర అభివృద్ధికి మరిన్ని నిధులు ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నారు.అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో బీఎల్ఏలు,కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండి పార్టీ ఓట్లు తొలగిపోకుండా కాపాడాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు చింతకుంట్ల రవీందర్ రెడ్డి, పాదూరి శ్రీనివాస్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బద్దం సుధీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్,సహకార బ్యాంక్ చైర్మన్ పాశం సంపత్ రెడ్డి,మండల నాయకులు,సర్పంచ్‌లు,మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం ప్రదర్శన

-భువనగిరిలో పీర్‌కు దట్టీ సమర్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భానుపురి / భువనగిరి:



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మొహర్రం ప్రదర్శన భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని పీర్‌కు దట్టీ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భువనగిరి ప్రాంతం ఎప్పటినుంచో మత సామరస్యానికి నిలయంగా నిలుస్తోందని అన్నారు.అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో పండుగలను కలిసి జరుపుకోవడం తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి మతపరమైన వేడుకలు ప్రజల్లో ఐక్యత, సామరస్యం, పరస్పర అవగాహనను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. పీర్ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రజలందరూ సుఖ శాంతు లు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్ర మానికి హాజరైన ప్రజలను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగ ళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ, పోత్నాక్ ప్రమోద్‌కుమార్, కూరవెంకటేష్, రజాఅద్నన్, రఘుబాబు, మజర్, బర్రె జహంగీర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, మత పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నందికొండలో సర్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన ఎమ్మార్వో

భానుపురి / నాగార్జునసాగర్:

నల్లగొండ జిల్లా నందికొండ మున్సిపాలిటీలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా రెండో రోజు దరఖాస్తుల పంపిణీ,స్వీకరణ ప్రక్రియను పెద్దవూర మండల తహసీల్దార్ ఖాసిం నాయక్ పరిశీలించారు. శుక్రవారం బూత్ నంబర్లు 107,110,111,112,113లను సందర్శించి,సర్ దరఖాస్తుల పంపిణీ,స్వీకరణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తీసుకున్న దరఖాస్తులను తప్పనిసరిగా పూర్తిగా నింపి డిజిగ్నేటెడ్ లొకేషన్ అధికారులకు (డీఎల్‌వోలకు) సమర్పించాలని సూచించారు. లేనిపక్షంలో ఓటు రద్దయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓటును ఒకచోట తొలగించే ప్రక్రియ కూడా కొనసాగుతోందని తెలిపారు. నందికొండ మున్సిపాలిటీలో సర్ ప్రక్రియ చురుగ్గా సాగుతుండటం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అశోక్‌తో పాటు బీఎల్‌వోలు దేవిక, సైదులు, రాధిక, కీర్తిరెడ్డి, కిషోర్, రమేష్, విజయ్, శేఖర్‌బాబు, లక్ష్మణ్‌నాయక్, మన్సూర్, కేశవ్,సునీల్, బంటు, పవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో ఘనంగా “ఛాత్రోన్ కీ గూంజ్” కార్యక్రమం

-విద్యార్థులు,యువత సమస్యలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

-ప్రభుత్వ విప్,డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య

భానుపురి / భువనగిరి:

విద్యార్థులు,యువత ఎదుర్కొంటున్న సమస్యలను దేశవ్యాప్తంగా వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ రాజస్థాన్‌లోని కోటలో ప్రారంభించిన “ఛాత్రోన్ కీ గూంజ్” (విద్యార్థుల స్వరం) కార్యక్రమాన్ని శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే,యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు బీర్ల అయిలయ్య పాల్గొని వేలాది మంది విద్యార్థులు,యువతతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజస్థాన్‌లో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, విద్యార్థులు, యువత సమస్యలకు స్వరం కల్పించడమే “ఛాత్రోన్ కీ గూంజ్” కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నాణ్యమైన విద్య,పారదర్శక పరీక్షల వ్యవస్థ, ఉద్యోగాల భర్తీ,యువతకు సమాన అవకాశాల కల్పన కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని, యువత ఆశయాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచే హక్కు కలిగి ఉండాలని, వారి సమస్యలు ప్రభుత్వాల దృష్టికి చేరేలా ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని అన్నారు.కార్యక్రమంలో విద్య, ఉద్యోగాలు,పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారత వంటి అంశాలపై చర్చించారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి,యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి భవ్యశ్రీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజర్, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ నాయకుడు రణధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సోషల్ మీడియా నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.